# మెదడులో కల్లోలం

- మూర్ఛ వ్యాధితో కలకలం
- జిల్లాలో 3 శాతం మందికి సమస్య
- జిల్లాలో 15 వేల మందికి పైగా మూర్ఛ రోగులు
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు, మందులు, చికిత్స
- నేడు జాతీయ మూర్ఛ వ్యాధి అవగాహన దినం

**సాదాసీదాగా రోడ్డుపై వెళ్తున్న వారు ఉన్నట్లుండి కింద పడి కాళ్లు, చేతులు కొట్టుకుంటూ, పళ్లు బిగబట్టి గట్టిగా అరుస్తూ, నోట్లో నురగలు కక్కుతూ కనిపిస్తారు. కొన్ని నిమిషాలకే వారు మళ్లీ సాధారణంగా మారి నడుచుకుంటూ వెళ్లిపోతారు. దీనినే మూర్ఛ/ఫిట్స్ అని పిలుస్తారు. వైద్యపరిభాషలో ఎలిలెప్సీగా పేర్కొంటారు. ఈనెల 17న జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవంగా ప్రత్యేక కథనం.**

– కర్నూలు(హాస్పిటల్)



ప్రభుత్వ వైద్యశాలలోని న్యూరాలజీ విభాగంలో ఈఈజీ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి సోమ, గురువారాల్లో 200 నుంచి 250 మంది చొప్పున చికిత్స కోసం వస్తారు. వీరిలో 20 శాతం మంది మూర్ఛవ్యాధి బాధితులుంటున్నారు. ఈ విభాగంలో ఐపీ సేవలతోపాటు ఈఈజీ, ఎపిలెప్సీ స్టడీ సేవలు కూడా లభిస్తున్నాయి. ఈ పరీక్షలు నెలకు 250, ఏడాదికి 3వేల మందికి చేస్తున్నారు. ప్రైవేటుగా ఈ పరీక్షలు చేయించుకోవాలంటే ఒక్కొక్కరికి రూ.2 వేలకు పైగా ఖర్చవుతుంది. అవసరమైన వారికి ఎంఆర్ఐ, వీడియో ఈఈజీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడే గాక జిల్లా మొత్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రులల్లో వైద్యుల వద్దకు వెళ్లే వారు ప్రతి నెలా మరో 8వేల మంది ఉంటారని అంచనా. మూర్ఛవ్యాధికి నాటు మందు తీసుకునే వారు కూడా ఉన్నారు.

**మూర్ఛ వ్యాధి ఎలా వస్తుందంటే...!**

మూర్ఛ(ఫిట్స్) అంటే మానవ కేంద్రీయ నాడీ వ్యవస్థ రుగ్మతల సమూహం. మెదడులోని ఎలక్ట్రిక్ యాక్టివిటి అసాధారణ పగుళ్ల వల్ల ఇది సంభవిస్తుంది. మూర్ఛలకు కారణం వాటి కేంద్ర స్థానాన్ని బట్టి వర్గీకరించవచ్చు. మూర్ఛలు తరచుగా కన్వల్షన్స్ లేదా ఎపిలెప్టిక్ ఫిట్స్‌గా సూచిస్తారు. ఇది సున్నా నుంచి 10 ఏళ్లలోపు, 50 నుంచి 70 ఏళ్లలోపు వారికి కలుగుతుంది. ఒక్కోసారి ఏ వయస్సులో వారికైనా రావచ్చు. వంశపారంపర్యం, మెనింజైటిస్, రక్తంలో షుగర్ శాతం పెరగడం, తగ్గడం , మెదడుకు గాయాలైనప్పుడు, గడ్డలు ఉన్నప్పుడు, రక్తంలోని కొన్ని ఆటో ఇమ్యూన్ కారణాల వల్ల మూర్ఛ వస్తుంది.

**మూర్ఛల్లో రకాలు–లక్షణాలు**

సాధారణ మూర్ఛలో మెదడు చాలా వరకు దెబ్బతింటుంది. టానిక్ క్లోనిక్‌లో ఆకస్మికంగా స్పృహ కోల్పోవచ్చు. రోగి పడిపోవడం, చేతులు, కాళ్లు కొట్టుకోవడం చేస్తారు. అబ్సెన్స్ లేక సెటిల్ మాలో మూర్ఛలో స్పృహ స్వల్పకాలంపాటు కోల్పోతారు. ఈ దశలో రోగి కొంత కాలం పాటు శూన్యంలోకి చూస్తూ ఉంటారు. మయోక్లోనిక్ మూర్ఛలో ఆకస్మిక, సంక్షిప్త కండరాలు సంకోచాలు సంభవిస్తాయి. ఇవి మొత్తం శరీరమంతా లేదా కొన్ని భాగాలకు సంభవిస్తాయి. అటోనిక్ మూర్ఛలలో ఆకస్మిక విచ్ఛిన్నం సంభవిస్తుంది. ఆ తర్వాత తక్షణమే కోలుకుంటారు. సరళమైన ఫోకల్ మూర్ఛలో రోగికి చేతులలో, కాళ్లల్లో కండరాల లాగుట కనిపిస్తుంది. లేదా వినికిడి, దృశ్యం, వాసన, రుచిలో ఆటంకం కలగవచ్చు. సంక్లిష్ట ఫోకల్ మూర్ఛలో రోగి స్పృహ కోల్పోతాడు. రోగికి విచిత్రమైన ప్రవర్తన ఉన్నట్లుగా కనిపిస్తాడు. కొన్ని సెకన్లు, నిమిషాల పాటు ప్రతిస్పందన లేకుండా ఉన్నట్లు కనిపిస్తుంది. సూక్ష్మ ముడతలు, లేదా ముఖం, చేతులు, కాళ్లు తరచూ లాగుతుంటాయి.

**మూర్ఛవ్యాధి నిర్ధారణ**

మూర్ఛ పేరుతో వైద్యుని వద్దకు వచ్చిన వెంటనే అతని పక్కన ఉన్న వ్యక్తితో జరిగిన సంఘటన గురించి వైద్యులు ఆరా తీసి అది మూర్ఛనా కాదా అని నిర్ధారిస్తారు. నిర్ధారణ కోసం అవసరమైతే సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఈఈజీ పరీక్షలు చేయిస్తారు. కొన్నిసార్లు వీడియో ఈఈజీ పరీక్ష కూడా చేయాల్సి రావచ్చు. వీటి ద్వారా మెదడులోని ఏ భాగం దెబ్బతినడం వల్ల మూర్ఛ వస్తుందో గుర్తిస్తారు.

**మూర్ఛ వచ్చినప్పుడు చేయాల్సినవి**

- ప్రశాంతంగా ఉండాలి.
- ప్రమాదాన్ని అంచనా వేసి లేదా ప్రమాదంలో ఉంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.
- తలను రక్షించాలి. మెడ చుట్టూ ఉన్న గట్టి దుస్తులు తీసేయాలి. కళ్లజోడు ఉంటే తొలగించాలి.
- సహాయక శ్వాసను పూర్తి చేసిన తర్వాత వారిని మెల్లగా రికవరీ స్థానంలో ఉంచాలి.
- రికవరీ పూర్తయ్యేవరకు వారితోనే ఉండాలి.
- వారికి భరోసా ఇవ్వాలి. తిరిగి మాటలతో ధైర్యం చెప్పాలి. మూర్ఛ ఉందని చెప్పకూడదు.
- అవసరమైతే ఆ వ్యక్తికి విశ్రాంతి/నిద్ర పోనివ్వాలి.

**మూర్ఛవచ్చినప్పుడు చేయకూడనివి.**

- చెంచా(స్పూన్)లతో నీటిని నోట్లో పోయకూడదు.
- వారి చేతులను అదిమి పట్టుకోవద్దు.
- నోటిలో ఏదైనా చొప్పించేందుకు ప్రయత్నించవద్దు. అది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగిస్తుంది. సహాయకుడి వేళ్లను కూడా గాయపరుస్తుంది.
- వారి చుట్టూ ఎక్కువ మంది గుమికూడవద్దు.
- నీరు, పానియాలు ఇవ్వవద్దు.
- వారు కదులుతున్నప్పుడు పట్టుకోవద్దు, ఇది చాలా ప్రమాదకరం.
- ఆ వ్యక్తి నీటిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా చూడాలి. నోటి నుంచి నురగరావచ్చు. అది రెండు నిమిషాలకంటే ఎక్కువ సమయం ఉండదు.

**క్రమం తప్పకుండా మందులు వాడాలి**



మూర్ఛ వ్యాధిగ్రస్తులు రెగ్యులర్‌గా మందులు వాడాలి. మధ్యలో మందులు ఆపకూడదు. ఇలా వాడితే కొంత కాలానికి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ఆల్కాహాలు తీసుకోకూడదు. 75 శాతం మందికి మందులతో పూర్తిగా నయమవుతుంది. కేవలం 25 శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. ఈ ఆపరేషన్‌ను ఒకప్పుడు కేరళలోని శ్రీచిత్ర ఆసుపత్రిలో చేసేవారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని నిమ్స్, ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రులతోపాటు అక్కడి ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా చేస్తున్నారు. అయితే ఆపరేషన్ కంటే ఎక్కువ మంది మందులు వాడటానికే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యపరీక్షలు, చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తున్నాం.

– డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ హెచ్ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

## స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

**కోడుమూరు రూరల్:** ఆనారోగ్య సమస్యలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యూక్లియస్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం కోడుమూరులోని జీవీఆర్ బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాలల్లో 0నుంచి 18సంవత్సరాల్లోపు పిల్లలందరికి ఉచితంగా 44రకాల సమస్యలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఆరోగ్య సమస్యలు గుర్తించి ఉచితంగా చికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం తైమూర్‌బాషా, పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ ముట్టడి

**కర్నూలు(సెంట్రల్):** పేదల ఇళ్ల నిర్మాణాలకు స్థలంతోపాటు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్వామిరెడ్డి నగర్, టీవీ9 నగర్, గిరి ప్రసాద నగర్, బుధవారపేట, పూలసుబ్బయ్య నగర్, ఎన్జీ నగర్, రామచంద్రనగర్, కస్తూరినగర్, షరీఫ్ నగర్‌లలో సీపీఐ నాయకులు ఇళ్ల స్థలాల కోసం 18న కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం 3 సెంట్ల స్థలం ఇస్తామని వాగ్దానం చేసి పట్టించుకోకుండా ఉన్నారని విమర్శించారు. ఆయనకు పేదల గోడును గుర్తు చేసేందుకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, గౌడ్, కోటమ్మ, శైలజ, అమినాబీ, కుమార్, నీలకంఠప్ప, కృష్ణ పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకం



రంగనాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వాసుతదేవగుప్త

**గడివేముల:** సమాజాభివృద్ధిలో గ్రంథాలయాలు పాత్ర కీలకమని ఎంపీడీఓ వాసుదేవగుప్త పేర్కొన్నారు. వారోత్సవాలలో భాగంగా స్థానిక గంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ప్రజలు, విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. గ్రంథాలయలను సద్వినియోగం చేసుకోవాని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, గఫూర్,దస్తగిరి పాల్గొన్నారు.



ఉద్యమ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఉద్యమకారులకు నివాళి**

**పాణ్యం:** మండల కేంద్రం పాణ్యం గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులకు ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఏర్పాటుకు వారు చేసిన ఉద్యమాలను ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి గుర్తు చేశారు.

## తప్పని ఫీట్లు!



గోరంట్ల ప్రధాన రహదారిలో ఇళ్ల ఎదుట గుంత తవ్వి వదిలేసిన దృశ్యం



నిచ్చెనపై ఇంట్లోకి వెళ్తున్న వ్యక్తి

**కోడుమూరు రూరల్ :** ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ప్రజలకు ఫీట్లు తప్పడం లేదు. మండలంలోని గోరంట్ల గ్రామంలో ప్రధాన రహదారి వెంట మురుగునీటి కాల్వ నిర్మాణం కోసం ఇళ్ల ఎదుట గుంతలను తవ్వించిన కాంట్రాక్టర్ అలాగే వదిలేశారు. దీంతో వారం రోజులుగా ఆయా గృహాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహాలు రోడ్డుకు నాలుగైదు అడుగుల ఎత్తు ఉండడంతో ప్రజలు బయటకు రావాలన్నా, ఇంట్లోకి వెళ్లాలన్నా అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు ఇంట్లోకి వెళ్లేందుకు నిచ్చెనలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలు కిందపడిన సందర్భాలు లేకపోలేదు. ఇక చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు వర్ణనాతీతం. రెండురోజుల క్రితం వర్షం కురువడంతో గుంతల్లోకి నీరు చేరి ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి తమ ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కర్నూలు మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

**కర్నూలు (రూరల్) :** గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పాటుపడాలని కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ సూచించారు. ర్నూలు మండలం ప్రజాపరిషత్ భవనంలో శనివారం ఎంపీడీఓ రఘునాథ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు నిర్వహించే గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఈ మేరకు పకడ్బందీగా ప్రణాలకలు రూపొందించుకుని పల్లెలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈఓఆర్డీ అనురాధ, డీఎల్‌పీ లక్ష్మి పంచాయతీల అభివృద్ధి, నిధుల వినియోగం తీరును వివరించారు. కార్యక్రమంలో అన్ని మండలాల గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ ఐక్య సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి**

**ఓర్వకల్లు:** గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ తిప్పన్న సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పన్న మాట్లాడుతూ అధికారులు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేప్పుడు ప్రజాప్రతినిధుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ గుర్తించిన ప్రతి పనికి ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు

**కర్నూలు కల్చరల్:** చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్లు మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని, మరిన్ని వివరాలకు 98485 63096 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నేడు నగర సంకీర్తన

**కర్నూలు కల్చరల్:** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన కార్యక్రమం ఉంటుందని ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు తెలిపారు. వన్‌టౌన్ గీతా మందిరం నుంచి మహా నగర సంకీర్తన ప్రారంభమవుతుందన్నారు. ఇస్కాన్ భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటలకు భగీరథ కాంప్లెక్స్‌లో పూరీ జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాద ప్రేమ విందు, భగవద్గీత తరగతులు ఉంటాయన్నారు.

## సచివాలయ సిబ్బంది వివరాలను అందజేయలేం



సూపరింటెండెంట్ కృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

**కోడుమూరు రూరల్ :** గ్రామ సచివాలయాల సిబ్బందికి సంబంధించిన వివరాలను తాము అందజేయలేమని మండల పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పంచాయతీ కార్యదర్శులను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ శనివారం పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఈఓఆర్డీ మంజులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయ సిబ్బందిపై పెత్తనం చేస్తున్నారని, వారు కూడా సచివాలయ సిబ్బందిలో భాగమేననంటూ జిల్లా కలెక్టర్ వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. తాము అధికారులు అప్పగించిన పనులనే సచివాలయ సిబ్బందికి చెబుతున్నామే తప్పా పంచాయతీ పనులు కాదన్నారు. ఇకనుంచి అధికారులు కూడా సచివాలయ సిబ్బందికి సంబంధించిన పనులను, ఇతర సర్వే వివరాలను గురించి పంచాయతీ కార్యదర్శులను అడుగరాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, వేణుగోపాల్, మురళీధర్, స్వామి, సలీమ్, స్వప్నకుమారి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## శారదా సంగీత నృత్య కళాశాలలో ముగిసిన అడ్మిషన్లు

**కర్నూలు కల్చరల్:** కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. గాత్రం, వయోలిన్, నాద స్వరం , మృదంగం, కూచిపుడి కోర్సుల్లో ప్రవేశాలు పెరిగాయన్నారు. గత ఏడాది 360 అడ్మిషన్లు జరిగితే ఈ ఏడాది 375 అడ్మిషన్లు వచ్చాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో తరగతులు ఉంటాయన్నారు.

## నేడు సాంఘిక నాటక ప్రదర్శన

**కర్నూలు కల్చరల్:** స్థానిక సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారిచే 'ఇది రహదారి కాదు' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని టీజీఈ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### జాతీయ జట్టుకు శాంతిరామ్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

**పాణ్యం:** మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ విభాగానికి చెందిన విద్యార్థులు శ్రీనివాసరెడ్డి, ఉసేనాలు ఆల్ ఇండియా సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈనెల 15న పులివెందుల జేఎన్‌టీయూలో జరిగిన హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలో తమ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. 2025 తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. అనంతరం విద్యార్థులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు.

### సమస్యలు పరిష్కరించాలి

**కల్లూరు:** కల్లూరు అర్బన్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు యేసు, నాగేష్ డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధి 31వ వార్డులో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవేంద్ర నగర్ మెయిన్‌రోడ్డు కల్వర్టుపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉందన్నారు. దీంతో వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### గుండెపోటుతో వీఆర్వో మృతి



మృతిచెందిన వీఆర్వో కుటుంబాన్ని ఓదార్చుతున్న తహిసీల్దార్ టీవీ రమేష్ బాబు

**కర్నూలు(రూరల్):** మండల పరిధిలోని దిన్నెదేవరపాడు వీఆర్వో వెంకటేశ్వర్లు (55) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఛాతిలో నొప్పి రావడంతో నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. నిడ్జూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు భార్య, కూమార్తె ఉన్నారు. కర్నూలు రూరల్ మండల తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

### ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

**కోడుమూరు రూరల్:** జాతీయ గ్రామీణఉపాధి పథకం కింద చేపడుతున్న పనులను కూలీ లు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మోదీన్ బాషా సూచించారు. శనివారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాటాడుతూ గ్రామాల్లో పను లు అవసరమైన కూలీలు ముందుకొస్తే కల్పిస్తామన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.300 రోజువారి కూలి పడుతుందన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని ఏపీఓ హెచ్చరించారు.

### రోడ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ నాగిరెడ్డి

**కల్లూరు:** సీసీ రోడ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ నాగిరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఉలిందకొండ, కొంగనపాడు గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవిమోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులు తగదు

**కర్నూలు(సెంట్రల్):** ఆదోని మండలం పాండవగల్లు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరమ్మపై రాజకీయ వేధింపులు తగవని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన కలెక్టర్‌కు వీరమ్మ దుస్థితిపై లేఖ రాశారు. 12 ఏళ్లుగా పనిచేస్తున్న వీరమ్మను తప్పుకోవాలని కూటమి నాయకులు వేధించడం అన్యాయమన్నారు. ఆమెను వేధిస్తున్న వారిపై పోలీసు కేసు నమోదు చేయాలని ఆయన అధికారులను కోరారు.

## బుగ్గరామేశ్వరుని సన్నిధిలో నంద్యాల జిల్లా కలెక్టర్



కలెక్టర్ రాజకుమారిని సత్కరిస్తున్న అర్చకులు లక్ష్మినారాయణశర్మ

**ఓర్వకల్లు:** మండలంలోని బుగ్గరామేశ్వర స్వామిని శనివారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా కలెక్టర్ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కళ్లె లక్ష్మినారాయణశర్మ కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారిని సత్కరించారు.

## 'అపార్' నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

**పాణ్యం:** మండల కేంద్రం పాణ్యం ఎంఆర్‌సీ భవనంలో శనివారం అన్ని పాఠశాలల హెచ్ఎంలకు అపార్ నమోదుపై ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదులో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అలాగే ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–2 మార్కులను అప్లోడ్ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు, విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చూడాలన్నారు.